ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...

మన సమగ్ర

RNI NO:TGTEL/25/A5443

# ప్రజావాణి

5 PM

తెలుగు డైలీ

మంగళవారం 15, సెప్టెంబర్, 2026

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY https://epaper.prajavaani.net

## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద

# శుద్ధి ఘటన

### సెల్ ఫోన్ సిగ్నల్స్ ట్రాకింగ్ ద్వారా
### బెయిల్ ఇప్పించే ప్రయత్నాల్లో బీఆర్ఎస్ లీగల్ సెల్




**సిద్దిపేట జిల్లా :** ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ వద్ద పసుపు నీటితో శుద్ధి చేసిన అంశంపై పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. అందులో వరదరాజపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రవీణ్ సైతం ఉన్నారు. పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం పట్ల దళిత సంఘాల నేతలు, కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ ఏసీపీతో పాటు మర్కూక్ పోలీస్ స్టేషన్‌లోనూ 5 ఫిర్యాదులు చేశారు. దీనిపై ముమ్మర విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో సవాలుగా తీసుకున్న పోలీసులు, సోమవారం ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఓ లాడ్జిలో ఉండగా పట్టుకున్నట్లుగా తెలుస్తోంది. వీరి ఆచూకీని సెల్ ఫోన్ సిగ్నల్స్? ట్రాకింగ్ ద్వారా కనిపెట్టినట్లు సమాచారం. లాడ్జిలో ఏడుగురు వ్యక్తులు ఉండగా, వారిలో ఒకరు తన మొబైల్ ఫోన్ ఆన్ చేయడంతోనే పోలీసులు వీరు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. అక్కడ వీరిని అదుపులోకి తీసుకొని గజ్వేల్?కు తరలించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. విచారించిన న్యాయస్థానం వీరికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు నిందితులను అక్కడి నుంచి సిద్దిపేట జైలుకు తరలించారు. ఈ ఘటనలో మొత్తం 9 మందికి పైగా కేసు నమోదు కాగా, వరదరాజ్‌పూర్ మాజీ సర్పంచ్ ప్రవీణ్, భాను, మల్లేశం, ఐలయ్య, ఆర్కల రాజు, అమరేందర్, కొడారి రాజులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు బాలముని, కనకయ్యలు దొరకాల్సి ఉంది. బీఆర్?ఎస్ లీగల్ సెల్ వీరందరికీ బెయిల్ కోసం యత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## చరిత్ర సృష్టించిన ఆంధ్రప్రదేశ్

# యువ ఆర్చర్

### ప్రపంచకప్ ఫైనల్లో స్వర్ణం, సీఎం అభినందనలు



ఆంధ్రప్రదేశ్ యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర చరిత్ర సృష్టించాడు. ప్రతిష్ఠాత్మక ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్లో పురుషుల రికర్వ్ స్వర్ణం సాధించిన తొలి భారతీయుడిగా అతడు ఘనత సాధించాడు. ఆదివారం అర్ధరాత్రి ముగిసిన ఫైనల్లో అతను షూటాఫ్‌లో నకానిషి (జపాన్)పై విజయం సాధించాడు. నిర్ణీత వ్యవధిలో స్కోరు 5–5తో సమం కావడంతో షూటాఫ్ అనివార్యమైంది. అందులో ధీరజ్ 10 పాయింట్లు సాధించగా నకానిషి 9 పాయింట్లే రాబట్టాడు. మరోవైపు ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్లో భారత్ నుంచి మహిళల విభాగంలో డోలా బెనర్జీ (2007) మాత్రమే రికర్వ్ పసిడి నెగ్గింది. ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత పురుష ఆర్చర్‌గా ధీరజ్ బొమ్మదేవర చరిత్ర సృష్టించారని సీఎం చంద్రబాబు కొనియాడారు. విజయవాడ ఆర్చరీ గ్రౌండ్స్ నుంచి మెక్సికోలోని ప్రపంచ వేదిక వరకు ధీరజ్ అద్భుత ప్రస్థానం సాగిందని అభినందించారు. పట్టుదల, ఏకాగ్రత, కఠోర సాధనతో ప్రపంచస్థాయి విజయాన్ని అందుకున్న ధీరజ్ రాష్ట్రంలోని యువ ప్రతిభకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. ధీరజ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని 'ఎక్స్' వేదికగా చంద్రబాబు ఆకాంక్షించారు.

## అసైన్డ్ భూములపై రేవంత్ ప్రభుత్వం వెంటనే

# శ్వేతపత్రం విడుదల చేయాలి



**ఢిల్లీ, సెప్టెంబర్ 15 :** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో 22ఏపై చర్చ జరుగుతుందని ప్రజలు భావించారని. కానీ అలా ఎందుకు జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. (మంగళవారం) ఢిల్లీలో మీడియాతో రఘునందన్ రావు మాట్లాడారు. గుడులు, బడులు, దేవస్థానాల భూములు, ప్రభుత్వ భూములు రిజిస్టర్ చేయొద్దని 22 ఏ చట్టం తీసుకువచ్చారని ప్రస్తావించారు. 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రిపేర్ కాకుండా అసెంబ్లీకి వచ్చారని విమర్శించారు. 22ఏ గురించి ఎవరు మాట్లాడినా అందరినీ ఒకే గాడిన కట్టడం సరికాదని అన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని సింఫనీ హోంలో రిజిస్ట్రేషన్ల సమస్య ఉండటంతో మాట్లాడానని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోయారనీ ఎలా మాట్లాడారని నిలదీశారు. 22ఏలో ఉన్నా 47440 ఎకరాలు ఎక్కడ, ఏ ఊరిలో తొలగించారో మంత్రి పొంగులేటి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 22 ఏ లో చేర్చిన భూమి తొలగించామంటున్న కాంగ్రెస్ 22 ఏ లో చేర్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు.

## ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్‌తో సీఎం రేవంత్ భేటీ..

# మూసీపై కీలక చర్చలు

### డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 15:** అగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(మంగళవారం) తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–ఎతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. 'మా వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో అగా ఖాన్ ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. అగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో ఇటీవలే మా శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకున్నాం. అగా ఖాన్ ఫౌండేషన్ కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించింది' అని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో అగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని సీఎం అన్నారు. ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. మూసీ నదిని నైట్ ఎకానమీ కోసం తీర్చిదిద్దుతామని వెల్లడించారు. తప్పకుండా గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్–ఎను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 100కు పైగా దేశాల ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరవుతారన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని.. నెట్–జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ ఉండబోతుందని అన్నారు. ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాల దూరంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ లాంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసు.సుప్రీంలో

# తెలంగాణ ప్రభుత్వానికి షాక్



**ఢిల్లీ, సెప్టెంబర్ 15 :** శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్‌వ్యవహారంలో తెలం గాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో షాక్ తగిలిం ది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై సుప్రీ ంకోర్టులో (మంగళవారం) విచారణ జరిగింది. ఈ కన్‌స్ట్రక్ష న్‌కి వ్యతిరేకంగా తెలం గాణ సర్కార్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాష్ట్ర హైకోర్టు తీర్పును సకాలం లో సవాలు చేయలేదని సుప్రీంకోర్టు అభిప్రా యప డింది. తగిన సమయంలో కౌంటర్ దాఖలు చేయకపోవడంతో విచారణకు తీసుకోలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం డిస్మిస్ చేసింది. గతంలో ఇదే కేసులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

## తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత

# దమనకాండ నడుస్తోంది

- అందుకోసమే విమోచన దినోత్సవం నిర్వహిస్తున్నాం..
- ఈ రెండు పార్టీలు ప్రజలకు ద్రోహం చేస్తున్నాయి.



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత దమనకాండ నడుస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ( ఆరోపించారు. రజాకార్ల పాలనలో ప్రజలు పడ్డ ఇబ్బందులు, రక్తపు గుర్తులు కనిపిస్తాయని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో విముక్తి కలిగిందని చెప్పుకొచ్చారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో కిషన్‌రెడ్డి మాట్లాడారు. నిజాం మెడలు వంచడంతో 1948 సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ గడ్డకు ముక్తి లభించిందని వెల్లడించారు. విమోచన చరిత్రను గత పాలకులు తొక్కిపెట్టారని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ప్రజలకు ద్రోహం చేస్తున్నాయి..కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విమోచన వేడుకలు జరపడానికి ఎందుకు భయపడుతున్నాయని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఏంఐఎం మోచేతి నీళ్లు తాగి ఈ రెండు పార్టీలు ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 90వ దశకంలో హైదరాబాద్ ముక్తి దివస్ చేయాలని అనేక పోరాటాలు చేశామని ప్రస్తావించారు. గత ఐదేళ్ల నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల సారథ్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇది రాజకీయ పరమైన అంశం కాదని .. యావత్తు తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతితో పాటు పలువురు కేంద్ర మంత్రులు తాము నిర్వహించే విమోచన వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన నిర్వహించే విమోచన వేడుకలకు హైదరాబాద్, తెలంగాణ ప్రజలు స్వచ్ఛందంగా రావాలని కోరారు.

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది

# గూండాలు దాడి చేశారు



**హైదరాబాద్:** హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు

# రోడ్డు ప్రమాదంలో మరణించిన నడిమింటి నరసింహులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**జాతీయ రహదారిచీన 65 కాంట్రాక్టర్ల పూర్తినిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదానికి కారణం**

**65 కాంట్రాక్టర్ యాజమాన్యం ,బాధిత కుటుంబానికి 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్,,**

**మైసగళ్ళ బుచేంద్ర మాదిగ మాజీ జిల్లా అధ్యక్షులు**





**మన ప్రజావాణి ప్రతినిధి :**
ఈరోజు ఉదయం ఎన్ హెచ్ 65 ముంబై జాతీయ రహదారిపై సదాశివపేట మండలం ముబారక్పూర్ గ్రామానికి చెందిన నడిమింటి నర్సింలు మాదిగ లారీ ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది, ఇట్టి ప్రమాదంలో పూర్తి నిర్లక్ష్యం జాతీయ రహదారిని విస్తరిస్తున్న కాంట్రాక్టర్ల దే బాధ్యతగ కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని

మైసగళ్ల బుచేంద్ర మాదిగ వీరాూ మాజీ జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు, వారు మాట్లాడుతూ అంతేకాకుండా ప్రభుత్వం కూడా విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే విధంగా ఒత్తిడితెకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా గత రెండు సంవత్సరాలుగా అసంపూర్తిగా సూచిక బోర్డులు లేకుండా అస్తవ్యస్తంగా పనులు చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి పేద మధ్యతరగతి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు, ఇట్టి విషయమై ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలు జరగకుండా విస్తరణ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా పూర్తి ఒత్తిడి చేసే బాధ్యత ప్రభుత్వానిదే అని డిమాండ్ చేశారు, బాధిత నడిమింటి నర్సింలు కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం దేని ప్రభుత్వం కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు,

విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ బృందం కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో గంధ గల్లా వీరయ్య మాదిగ ఎమ్మెస్పీ జిల్లా , కొలుకుందు మోహన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, ముబారక్ పూర్ గ్రామ సర్పంచ్ , నరేష్, కేసారం కృష్ణ, రాములు, వెంకట్ గ్రామస్తులు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొడుకు చావుకు న్యాయం కావాలి"...!

**ముదిగొండలో కన్నీరుమున్నీరవుతున్న కన్నతల్లి ఆవేదన...?**

**జిల్లాను కుదిపేస్తున్న వినయ్ కుమార్ ఆత్మహత్య ఉదంతం**

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి**
బ్లాక్‌మెయిలర్ల వేధింపులు, ఆపై పోలీసుల లాఠీదెబ్బలు... తట్టుకోలేక నా కొడుకు ప్రాణం తీసుకున్నాడు. ఐదు రోజులు గడుస్తున్నా మాకు న్యాయం జరగడం లేదు. మీలో ఒకడిగా నా కొడుకుని అనుకుని, ఈ కన్నతల్లికి న్యాయం చేయండి అన్నలారా, తమ్ముళ్లారా..." అంటూ మృతుడు వినయ్ కుమార్ తల్లి మెట్టెల ఆదిలక్ష్మి గొంతు తడారిపోయేలా, కన్నీరుమున్నీరవుతూ చేస్తున్న ఆర్తనాదాలు ముదిగొండ మండల ప్రజల హృదయాలను కలచివేస్తున్నాయి.అసలేం జరిగింది?స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే... ఇద్దరు వ్యక్తులు చేసిన తీవ్రమైన బ్లాక్‌మెయిల్ కారణంగా వినయ్ కుమార్ కుటుంబం తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంతలోనే న్యాయం చేయాల్సిన పోలీసు వ్యవస్థ కక్షపూరితంగా వ్యవహరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి వినయ్‌ని, అతని తండ్రిని, అలాగే వినయ్ మేనమామను తీవ్రంగా కొట్టినట్లు తెలుస్తోంది.ఈ బ్లాక్‌మెయిల్ వేధింపులు, సమాజంలో పోలీసులు అందరి ముందు కొట్టడం వల్ల తమ కుటుంబ పరువు, మర్యాదలు గంగలో



కలిసిపోయాయని వినయ్ కుమార్ తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. సమాజానికి మొహం చూపించలేక, అవమానాన్ని భరించలేక చివరికి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఒక నిండు ప్రాణం బలైపోయి ఐదు రోజులు గడుస్తున్నా, ఇంతవరకు బాధితులకు సరైన న్యాయం అందకపోవడంపై ముదిగొండ మండల ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.బాధిత కుటుంబం మరియు ముదిగొండ మండల ప్రజల ప్రధాన డిమాండ్లు కొన్ని వినిపిస్తున్నాయి. ప్రధానంగాఎస్ఐ ని తక్షణమే సస్పెండ్ చేయాలివినయ్ ని, అతని తండ్రిని, మేనమామను చట్టానికి విరుద్ధంగా కొట్టి, ఆత్మహత్యకు కారణమైన స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ ని వెంటనే విధుల్లోంచి సస్పెండ్ చేయాలి. బ్లాక్‌మెయిలర్లకు కఠిన శిక్ష పడాలి: వినయ్ మరణానికి ముందస్తు కారణమైన, అతడిని బ్లాక్‌మెయిల్ చేసిన ఆ ఇద్దరు వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలి.ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి: దిక్కుతోచని స్థితిలో ఉన్న వినయ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి. వారిని అన్ని విధాలా ఆదుకుంటూ తక్షణమే భారీ ఆర్థిక సహాయం ప్రకటించాలి.తమకు న్యాయం జరిగే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు స్థానిక లోకల్ న్యూస్ ఛానెళ్లు, మీడియా ప్రతినిధులు, మరియు మండల ప్రజలు తమకు అండగా నిలబడాలని వినయ్ తల్లి ఆదిలక్ష్మి చేతులు జోడించి వేడుకుంటోంది. ఒక కన్నతల్లి ఆవేదనను ఆలకించి, ఉన్నతాధికారులు స్పందించి వినయ్ ఆత్మహత్యకు కారణమైన వారిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ముదిగొండ ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తోంది.

## శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుని విగ్రహ ప్రతిష్ట

**పెద్దవంగర సెప్టెంబర్ 14 ప్రజావాణి.**





పెద్దవంగర మండల కేంద్రంలో రామచంద్ర తండా ఎక్స్ రోడ్ నందు గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు గణనాథుని ప్రతిష్టించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు సతీష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామచంద్రు, రాయరపు రాజు, రాము, వేణు, లక్ష్మణ్, ముకేష్, బబ్లూ,మరియు యూత్ సభ్యులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

# హన్మకొండలో తప్పిన పెను ప్రమాదం

## భారీ వృక్షం నేలకూలడంతో తప్పిన పెను ప్రమాదం





**ప్రజావాణి సెప్టెంబర్ 15** హన్మకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో భారీ వృక్షం నేలకూలడంతో పెను ప్రమాదం తప్పింది గార్డెన్లోని చెట్టు ఒక్కసారిగా రోడ్డుపై వెళ్తున్న బస్సు పై పడగా సమీపంలో ఉన్న రెండు బైకులు మూడు ఆటోలు తీవ్రంగా దెబ్బతిని నుజ్జు నుజ్జు అయ్యాయి

బస్సు వెళుతుండగానే ఈ ఘటన జరగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురైనప్పటికీ ప్రమాదంతశాత్తు ఎలాంటి ఈ ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు

# పిడుగుపాటుకు పాడిగేదె మృతి. రైతుకు 80 వేల నష్టం.






**హుజూర్నగర్ సెప్టెంబర్ 15 (ప్రజావాణి)**
సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ మఠంపల్లి మండలంలోని మట్టపల్లి గ్రామంలో సోమవారం పిడుగుపాటు కు మాలోతు తులిస్య కు చెందిన పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. మేత మేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చనిపోయిన గేదె విలువ సుమారు రూ 80,000 ఉంటుందని బాధితుడు తెలిపారు. తన కుటుంబానికి ప్రధాన ఆధారమైన గేదె మరణించడంతో తీరని లోటు వాటిల్లిందని తులిస్య ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని కోరారు.ఘటన స్థలాన్ని పరిశీలించిన రెవిన్యూ అధికారులు. మాలోతు తులిస్య కు చెందిన పాడి గేదే మృతి చెందిన ప్రదేశాన్ని మండల ఆర్ఐ, విఆర్ఓ పరిశీలించి పూర్తి వివరాలు సేకరించి మఠంపల్లి తాసిల్దార్ కి నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

# సలిగుట్ట తాండాలో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

**వి ఆర్.వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛమైన తాగునీటి కోసం కార్యక్రమం**



**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా : లిమంచాల (ప్రజావాణి): సెప్టెంబర్16**
స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వి ఆర్ వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచాల మండలం. సలిగుట్ట తాండాలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఈరోజు ప్రారంభించారు.ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఉపయోగకరమైన కార్యక్రమాలను నిరంతరం చేపట్టడమే వి ఆర్ వన్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వి ఆర్ వన్ ఫౌండేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు."స్వచ్ఛమైన నీరు -- ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తు" అనే లక్ష్యంతో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

# కూకట్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో బజరంగ్ యూత్ అసోసియేషన్ వినాయక చవితి వేడుకలు



**కూకట్‌పల్లి (ప్రజావాణి) సెప్టెంబర్ 15** కూకట్‌పల్లిలో బజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద యువత, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# ప్రజా వాణి దిన పత్రిక వార్తకు స్పందన"

## కాలేజీ విద్యార్థులకు బస్సు పునరుద్ధరణ

## ప్రజా వాణి కృషికి లద్నూరు గ్రామస్థుల హర్షం

## ప్రజా వాణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు



**మద్దూరు సెప్టెంబర్ 15, ప్రజా వాణి,**
మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు విద్య కోసం జనగామకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉన్న బస్సును తొలగించడంతో ఈ నెల 9న లద్నూరు గ్రామ పంచాయతీ ముందు 30 మంది విద్యార్థులు స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు చేపట్టిన ధర్నాతో స్పందించిన డిపో మేనేజర్ ఏం. ఉషా మంగళవారం నుండి యధావిధిగా బస్సు పునరుద్ధరణ చేయడంతో డిపో మేనేజర్ కు కృతజ్ఞతలు తెలిపారు.అదే విధంగా మా విద్యార్థుల సమస్యను అధికారుల దృష్టికి మా సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేసిన ప్రజా వాణి దిన పత్రిక యాజమాన్యానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# అందోల్ గురుకుల బాలికల కళాశాలలో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు



**మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 15 అందోల్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**
అందోల్ గురుకుల బాలికల కళాశాలలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో వినాయకుని ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వినాయకునికి పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థినులలో భక్తిభావం, ఐక్యతను పెంపొందించేలా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com